

హామీ ఇచ్చారు.. నెరవేరుస్తున్నారు



జియ్యమ్మవలస: చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఇలా..

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగ్‌లు
- పంపిణీకి ఆదేశాలిచ్చిన టీడీపీ కూటమి సర్కారు
- త్వరలో ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా అందించనున్న అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు

(పార్వతీపురం టౌన్, జూలై 29)

ఇంటర్ విద్యార్థులకు మంచిరోజులొచ్చాయి.. ఇకపై వారు శ్రద్ధగా చదువుకుని.. ఉత్తమ ఫలితాలు సాధించేలా టీడీపీ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే వారికి త్వరలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగ్‌లను అందించనుంది. ఇప్పటికే దీనిపై సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఆయా సామగ్రి చేరింది. త్వరలోనే వాటిని పంపిణీ చేయనున్న నేపథ్యంలో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గనుందని, అత్యధికులు ఇంటర్ విద్యపై ఆసక్తి చూపనున్నారని జిల్లావాసులు అభిప్రాయపడుతున్నారు.

గత వైసీపీ సర్కారు పాలనలో..

సాధారణంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరేవారిలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. అయితే గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఇంటర్ విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. తొలి ఏడాది అరకొరగానే ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలు ఇచ్చింది. ఆ తర్వాత పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం అమలుకు మంగళం పాడేసింది. దీంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బయట పుస్తకాలు కొనుగోలు చేద్దామన్నా దొరకని పరిస్థితి ఎదురైంది. దీంతో కొంతమంది విద్యార్థులు కళాశాలల వైపు పెద్దగా దృష్టి పెట్టేవారు కాదు. ఆర్థిక సమస్యలతో చాలామంది పుస్తకాలను కొనుగోలు చేయలేకపోయేవారు. మరికొంతమంది అధ్యాపకులు చెప్పిన పాఠాలను అర్థం చేసుకుని చదువుకునేవారు. పాఠ్య పుస్తకాలు లేకపోవడంతో పరీక్షల సమయంలో ఇబ్బంది పడేవారు. అనుకున్న స్థాయిలో ఫలితాలు కూడా వచ్చేవి కావు. ఇంకెంతోమంది ఇంటర్ విద్యకు దూరమయ్యారు. ఇదే సమయంలో కొందరు తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తమ పిల్లలను ప్రైవేటు కాలేజీల్లో చేర్పించేవారు.

మొత్తంగా వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇంటర్ విద్య.. తల్లిదండ్రులకు ఆర్థికభారమైంది. ఈ నేపథ్యంలో ఇంటర్ విద్యను గాడిలో పెట్టాలని ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్సులు, బ్యాగులు అందజేయనుంది. ఇప్పటికే అవి జిల్లాకు చేరుకోగా.. త్వరలో పంపిణీ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, మోడల్ కాలేజీలు, కేజీబీవీల్లో ఇంటర్ చదివే విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని మరోవైపు మంత్రి నారా లోకేష్ కూడా ఆదేశించారు. సర్కారు తాజా నిర్ణయంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు పోటీపడి చదివి.. మెరుగైన ఫలితాలు సాధించే వీలుంటుంది. మొత్తంగా ఐదేళ్ల తర్వాత ఇంటర్ విద్యకూ.. విద్యార్థులకు మంచి రోజులు రావడంపై సర్వత్రా హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో మొత్తంగా 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులకు 2,543 పాఠ్యపుస్తకాలు, 39,216 నోట్ బుక్‌లను రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అందించనుంది. అదేవిధంగా 2,722 బ్యాగులను అందించనున్నారు. సర్కారు ఆదేశాల మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులందరికీ వాటిని పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారిణి మంజులా వీణ తెలిపారు.



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పంపిణీకి సిద్ధంగా ఉన్న పాఠ్యపుస్తకాలు

సంతోషంగా ఉంది..



మాలాంటి పేద విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగ్‌లు పంపిణీ చేయాలని నిర్ణయించడం చాలా సంతోషంగా ఉంది. గతంలో ఏ ప్రభుత్వం ఇలా పంపిణీ చేయలేదు. ప్రస్తుత టీడీపీ సర్కారు నిర్ణయంతో మా లాంటి పేద కుటుంబాలపై కాస్త భారం తగ్గుతుంది. మేం కూడా చక్కగా చదువుకుని మంచి మార్కులు సాధించే వీలుంది.

-భవ్య, సీఈసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పార్వతీపురం

మాలాంటి వారికి వరం..



టీడీపీ కూటమి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగ్‌లు పంపిణీ చేయాలనుకోవడం సంతోషదాయకం. మాలాంటి పేద విద్యార్థులకు ఇదొక వరం. రానున్న రోజుల్లో మాకు యూనిఫామ్స్ పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.

-కిరణ్, హెచ్ఈసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పార్వతీపురం

త్వరలోనే పంపిణీ..

రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగులకు ఇవ్వాలనుకోవడం హర్షణీయం. దీనివల్ల విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుంది. మరింత మంది ఇంటర్ విద్యను అభ్యసించే అవకాశం ఉంది. పేద విద్యార్థుల కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఆలోచనకు నిదర్శనం. త్వరలోనే పాఠ్య, పుస్తకాలు, నోట్ బుక్‌లు, బ్యాగుల పంపిణీ చేపడతాం.

-రామారావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పార్వతీపురం



ఇసుక ర్యాంప్ మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో

అక్కడ ఇసుక తవ్వకాలు ఆపండి

- ఏవోబీ సరిహద్దు ర్యాంపుపై పాలకొండ ఆర్డీవో రమణ ఆదేశం
- సర్వే చేసి నివేదికలు అందించాలని సిబ్బందికి సూచన

భామిని: భామిని మండలం దిమ్మిడిజోల సమీపంలో వంశధార నది వద్ద ఉన్న ఏవోబీ సరిహద్దు ఇసుక ర్యాంప్‌లో తవ్వకాలు ఆపాలని పాలకొండ ఆర్డీవో వీవీ రమణ ఆదేశించారు. సోమవారం ఆ ర్యాంపును ఆయన పరిశీలించారు. ఒడిశా బోర్డు ఏర్పాటు చేసి ఆంధ్రా భూభాగం నుంచి ఇసుక తరలిస్తున్నట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. దీనిపై గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. పూర్తిస్థాయి సర్వే చేసి ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల నివేదికలు పంపించాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులను ఆర్డీవో ఆదేశించారు. ఒడిశా అనుమతులతో ఆంధ్రా వైపు ర్యాంపులో ఇసుక తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. సొలికిరి గ్రామానికి చెందిన కొత్తకోట గోవిందరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ విచారణ జరిగినట్టుగా తెలుస్తోంది. డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, సిఐ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ తదితరులున్నారు.



జిల్లా ఆసుపత్రి ఆవరణలో అచేతనంగా పడి ఉన్న వృద్ధురాలు

కనికరం లేకుండా..

పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి ఆవరణలో సోమవారం అచేతనంగా పడి ఉన్న వృద్ధురాలిని చూసి స్థానికులు చలించిపోయారు.. కదలలేక.. మాట్లాడలేక.. కొన ఊపిరితో ఉన్న ఆమెను ఎవరో అక్కడ వది లేసి వెళ్లిపోయారు. అసలు ఏ ఊరి నుంచి ఎవరు తీసుకొచ్చారో.. ఎందుకు ఆసుపత్రి ఆవరణ పడేశారో తెలియరాలేదు. కనీసం ఆసుపత్రి సిబ్బంది కూడా పట్టించుకోలేదు. కనికరం లేకుండా ఆ వృద్ధురాలిని అలా అక్కడ వదిలేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ విషయాన్ని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవికి తెలియజేయగా.. వెంటనే ఆ వృద్ధురాలికి వైద్యం అందించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కాగా వైద్యం కోసం తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు ఆ వృద్ధురాలిని ఆసుపత్రి ఆవరణలో వదిలేసి వెళ్లిపోయినట్టుగా ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని వారు చెప్పారు.

- పార్వతీపురం టౌన్

గిరిజన ప్రాంతాల
అభివృద్ధికి కృషి

- పార్వతీపురం ఐటీడీఏ నూతన పీవో మాధవన్

పార్వతీపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పీవో సేదు మాధవన్ తెలిపారు. సోమవారం అయన పార్వతీపురం ఐటీడీఏలో పీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేఖర్లతో మాట్లాడుతూ.. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. విద్య, వైద్యం, తాగు, సాగునీటి సదుపాయాలతో పాటు రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. గిరిజనుల సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. అందరి సహకారంతో ప్రభుత్వ లక్ష్యాలను నెరవేరుస్తామని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టరేట్ చేరుకుని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఆ తర్వాత పీవో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని అర్జీలను స్వీకరించారు.



కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీవో మాధవన్

9న ఆదివాసీ దినోత్సవం

- ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా సంబరాలు
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఏర్పాట్లు
- అధికారుల సమీక్షలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వచ్చేనెల 9న ఆదివాసీ దినోత్సవం నిర్వహించ నున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు అద్దం పట్టే విధంగా వేడుకలు ఉండాలన్నారు. స్థానిక కళాకృతులు, నృత్యాలు, వంటకాలు, పంటలు ప్రదర్శనకు వీలుగా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదివాసీ దినోత్సవం నిర్వహణకు వివిధ కమిటీలను ఏర్పాటు చేశామని జాయింట్ కలెక్టర్ శోభిక తెలిపారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో మాధవన్, ఏఎస్పీ దిలీప్‌కిరణ్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఆర్డీవో కె.హేమలత, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి, డీఆర్‌డీఏ పీడీ వై.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఖరీఫ్ కష్టాలు





- రైతులను వేధిస్తున్న కూలీల కొరత
- తడిసిమోపెడవుతున్న వ్యవసాయ ఖర్చులు
- వరుణుడు కరుణించినా.. సకాలంలో నాట్లు వేసుకోలేని పరిస్థితి..
- అప్పులు చేసి.. పనులు చేపడుతున్న వైనం

పాలకొండ,జూలై 29: జిల్లాలో ఖరీఫ్ రైతులకు కూలీల కొరత వేధిస్తోంది. దీంతో సకాలంలో నాట్లు వేయలేకపోతున్నారు. మరోవైపు వ్యవసాయ ఖర్చులు అమాంతం పెరిగిపోవడంతో లబోదిబోమంటున్నారు. వాస్తవంగా జిల్లాలో 70 శాతానికి పైగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలే ఉన్నాయి. ఈ ఏడాది వారు సుమారు రెండు లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు చేపట్టనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారు. కాగా ఇటీవల కురిసిన వర్షాలకు వారంతా ఖరీఫ్ పనులకు సిద్ధమయ్యారు. మరోవైపు ప్రాజెక్టుల ద్వారా వస్తున్న నీటితో మరికొందరు నాట్లు వేసేందుకు సన్నద్ధమయ్యారు. ఈ తరుణంలోనే వారికి కూలీల సమస్య వెంటాడుతుంది. చేసేదేమీ లేక కొంతమంది రైతులు అందుబాటులో ఉన్న కూలీలకు అధిక మొత్తాలను చెల్లించి వ్యవసాయ పనులు ముమ్మరం చేస్తున్నారు.

ఖర్చులు ఇలా..

కూలీల కొరత నేపథ్యంలో జిల్లా రైతులు అందుబాటులో ఉన్న వారితో వ్యవసాయ పనులు చేసేందుకు పోటీ పడుతున్నారు. అయితే ఇదే అదునుగా కొందరు అధిక మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంకొం దరు కాంట్రాక్ట్ పద్ధతిలోనే వ్యవసాయ పనులు చేపడుతున్నారు. గతంలో ఎకరా వరినారు తీసేందుకు రూ.2,500 చెల్లించగా.. ప్రస్తుతం రూ.3,500 వరకు డిమాండ్ చేస్తున్నారు. నారును పొలంలో సర్దేందుకు ఎకరానికి రూ.500 తీసుకునేవారు ప్రస్తుతం రూ.1500 వరకు అడుగుతున్నారు. నాట్లు వేసేందుకు గతంలో ఎకరాకు రూ.2,500 వరకు చెల్లించగా.. ప్రస్తుతం రూ.3,500 వరకు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో అధిక మొత్తం చెల్లించి.. వ్యవసాయ పనులు చేయిస్తున్నారు. పెట్టుబడులు భారీగా పెరిగి పోవడంతో కొందరు అప్పులు చేస్తున్నారు. మరికొందరు ఇంటిలో బంగారం ఆభరణాలను తనఖా పెట్టాల్సి వస్తోంది.

వలస బాటలో...

గతంలో పాలకొండ, పార్వతీపురం, సాలూరు, కురుపాం నియోజక వర్గాల పరిధిలోని 15 మండలాల్లోనూ వేల సంఖ్యలో వ్యవసాయ కూలీలు ఉండే వారు. అయితే కాలక్రమంలో ఎంతోమంది వలసబాట పట్టారు. వ్యవసాయ పనుల ద్వారా శారీరక కష్టం తప్ప అనుకున్న స్థాయిలో కూలి కూడా గిట్టుబాటు కాకపోవడంతో అత్యధికులు వ్యవసాయ పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. వ్యవసాయేతర పనులు చేపట్టేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లి భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు. మరికొందరు ఫ్యాక్టరీల్లో చేరుతున్నారు. దీంతో జిల్లాలో వ్యవసాయ పనులు చేసేందుకు కూలీల కొరత వేధిస్తుంది.

గత ప్రభుత్వం తీరుతో..

జిల్లాలో రైతుల సమస్యలను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోలేదు. ఎరువులు, విత్తనాల విషయం పక్కన పెడితే.. వారికి అవసరమైన యంత్ర పరికరాలను కూడా సబ్సిడీపై అందించలేకపోయింది. కొంతమంది వైసీపీ కార్యకర్తలు, నాయకులు మాత్రమే కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా వ్యవసాయ యంత్రాలను పొందారు. గత టీడీపీ ప్రభుత్వం మాత్రం అన్నదాతలకు అవసరమైన యంత్ర పరికరాలను అందించింది. దీంతో వారు కొంతమేర కూలీల సమస్యను కూడా అధిగమించే వారు. కాగా ఇప్పుడు రైతులంతా నూతన ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. యంత్ర పరికరాలను అందించాలని వారు కోరుతున్నారు.

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైం ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ

ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్‌ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,50,000

ఎంసీఏ

ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50% మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,25,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 14
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగరం ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/yArgvZGలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ, పీజీ



హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు.

● డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూమీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

● డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

● సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

● ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

నవ్య | చిత్రజ్యోతి

పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ చిత్ర పరిశ్రమ సోమవారం సమావేశమై కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. వీటిల్లో ప్రధానమైంది, తెలుగు నిర్మాతలు సాహసించి తీసుకోలేనిది ఏమిటంటే .. ఇకపై హీరోలు, హీరోయిన్లకు ముందుగా అడ్వాన్సులు ఇవ్వకూడదన్నది. కొంతమంది నటీనటులు, టెక్నీషియన్లు నిర్మాతల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుని సినిమాలకు డేట్స్ ఇవ్వకుండా ఆ తర్వాత ఒప్పుకొన్న చిత్రాలకు వర్క్ చేస్తున్నారు. ఇకపై అలా కాకుండా మొదట ఎవరివద్ద అడ్వాన్స్‌లు తీసుకున్నారో వారి షూటింగ్ పూర్తి చేసిన తర్వాతే కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొనాలి. తమిళంలో ఈ నిర్ణయాన్ని అమలు చేయగలరేమో కానీ తెలుగులో సాధ్యమయ్యే పనేనా అనే చర్చ తెలుగు చిత్ర పరిశ్రమలో మొదలైంది. ఎందుకంటే ప్రముఖ సంస్థలు పెద్ద హీరోలకు అడ్వాన్సులు ఇవ్వడం, వారు తీసుకోవడం సహజంగా జరిగేదే. ఇలా అడ్వాన్స్ ఇచ్చిన వెంటనే ఆ సినిమా మొదలవుతోందా అంటే చాలా సందర్భాల్లో లేదనే చెప్పాల్సి ఉంటుంది. కథ కుదరకో, కాంబినేషన్ సెట్ అవకో సినిమాలు ప్రారంభం కావడానికి లేట్ కావచ్చు. ఆ లేట్ అనేది నెలలు కావచ్చు, సంవత్సరాలు కావచ్చు. ఏళ్ల తరబడి వెయిట్ చేసినా చివరకు జరగని సందర్భాలు ఉన్నాయి కూడా. ఈ లోపు అన్నీ సెట్ అయిన వేరే సినిమా మొదలుపెట్టేస్తుంటారు హీరోలు. హీరోలకు ఇచ్చిన అడ్వాన్సులకు వడ్డీలు కడుతూ లోలోపల బాధ పడుతుంటారు తప్ప బయటకు వ్యక్తం వ్యక్తం చేయలేని పరిస్థితి. ఎందుకంటే ఎప్పటికైనా హీరోగారు కరుణించి డేట్స్ ఇవ్వవచ్చనే ఓ ఆశ వారిని సంవత్సరాల తరబడి వెయిట్ చేసేలా చేస్తుంటుంది. అలాగే ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ఓ వారం రోజుల పాటు షూటింగ్ చేసో, లేక కొంత భాగం షూట్ చేసిన తర్వాత ఆ సినిమాను అలా పక్కన పెట్టేసి మరో కొత్త చిత్రం చేసే హీరోలు తెలుగు చిత్రపరిశ్రమలోనూ ఉన్నారు. ఇలాంటి విషయాలపై తెలుగు చిత్ర పరిశ్రమ కూడా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడిస్తుంటుంది కానీ అవి ఆచరణకు దూరంగానే ఉంటున్నాయి. ఇటువంటి నేపథ్యంలో తమిళ నిర్మాతలమండలి తీసుకున్న నిర్ణయాలు రేకెత్తిస్తున్నాయి. తెలుగులో కూడా ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని నిర్మాతల మనసులో ఉంది కానీ పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?



తమిళ నిర్మాతల మండలి నిర్ణయాలు ఇవే

అధ్యక్షుడు ఎన్.మురళి నేతృత్వంలో సభ్యులు సోమవారం వివిధ సంఘాలకు చెందిన నిర్వాహకులు, ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. అవేమిటో ఇప్పుడు చూద్దాం.

● ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ మొదలు పెట్టకూడదు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న సినిమాలన్నీ అక్టోబరు 31 లోపు పూర్తి చేయాలని ఆయా చిత్ర బృందాలకు సూచించింది.

● పెండింగ్‌లో ఉన్న చిత్రాలు, ఇచ్చిన అడ్వాన్స్‌లపై నివేదిక అడిగిన నిర్మాతల మండలి.

● నవంబరు ఒకటినుంచి ఎలాంటి సినిమాల చిత్రీకరణ చేపట్టకూడదు.

● ఇప్పటికే చిత్రీకరణ పూర్తయి విడుదలకు నోచుకోని చిత్రాల పరిస్థితి ఒక కొలిక్కి వచ్చేంత వరకు ఆగస్టు 16 నుంచి కొత్త సినిమాలేవీ చిత్రీకరణ మొదలుపెట్టకూడదు.

● నటీనటులు, సాంకేతిక నిపుణులు జీతభత్యాలు పెంచుకుంటూ పోతున్నారని, ఖర్చులకు ఒక విధానమంటూ లేకపోయిందని, ఈ అంశాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్మాతలమండలి అభిప్రాయపడింది. వీటిని క్రమబద్ధీకరించడంతో పాటు సరైన ప్రణాళికతో ముందుకుసాగాలని, అందువల్ల నవంబరు ఒకటో తేదీ నుంచి ఏ ఒక్క సినిమా షూటింగ్ జరగరాదని తీర్మానించింది.

● అగ్రనటులు నటించే కొత్త చిత్రాలను ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలని తీర్మానించింది.


-ఆంధ్రజ్యోతి, చెన్నై



ధనుష్ పై ఆగ్రహం

హీరో ధనుష్‌పై తమిళ నిర్మాతల మండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈయన ఆరు చిత్ర నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నారని, ఇలా అడ్వాన్సులు చెల్లించిన మిగిలిన నిర్మాతలు కూడా అసోసియేషన్‌తో మాట్లాడి తమ పనులు మొదలు పెట్టాలని సూచన చేసింది. ఇకపై నిర్మాతల మండలి అనుమతి ఉంటేనే ధనుష్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తుంది. అయితే ధనుష్ ఇప్పుడు తెలుగులో రెండు చిత్రాల్లో నటిస్తున్నారు కనుక ఈ నిర్ణయాల ప్రభావం ఆయన మీద అంతగా ఉండక పోవచ్చు.

కంటి చికిత్స కోసం అమెరికాకు?



బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్ అత్యవసర కంటి చికిత్స కోసం అమెరికా వెళ్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన కంటి సమస్యతో సోమవారం ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు అమెరికా వెళ్లాలని సూచించినట్లు సమాచారం. దీంతో నేడు షారూఖ్ అమెరికా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై షారూఖ్ పీఆర్ బృందం ఇంతవరకూ స్పందించలేదు. 2014లో షారూఖ్ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఆయన ప్రస్తుతం కింగ్ చిత్రంలో నటిస్తున్నారు.

మూర్ఖులను గెలవలేము



ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలను అభిమానులతో పంచుకున్న సమంత వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. తాజాగా నయనతారకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. తనకు ఆసక్తిగా అనిపించిన పలు విషయాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె మందార పువ్వులతో చేసిన టీ అంటే తనకు ఎంతో ఇష్టమని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం దొరుకుతుందని నయనతార పేర్కొన్నారు. ఫాలోవర్స్‌ను నయనతార తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆమె చెప్పినదాంట్లో నిజం లేదని కొంతమంది వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె తన పోస్ట్‌ను తొలగించారు. 'మూర్ఖులతో వాదనకు దిగొద్దు. మీరు గెలవలేరు. మిమ్మల్ని కూడా వారి స్థాయికి దిగజార్చి ఓడిస్తారు' అనే మార్క్ ట్వైన్ సూక్తిని షేర్ చేశారు. తనను విమర్శించిన వారిని ఉద్దేశించి ఆమె ఈ పోస్ట్ పెట్టారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

కొత్తగా..

రొమాంటిక్‌గా రాజా సాబ్



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రం నుంచి సోమవారం అప్డేట్ వచ్చింది. ప్యాన్ ఇండియా గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రభాస్ వింటేజ్ లుక్‌లో ఛార్మింగ్‌గా కనిపించారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే 40 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఆగస్టు 2 నుంచి మరో భారీ షెడ్యూల్ ప్రారంభించనున్నారు.

చిత్రం: రాజాసాబ్
ప్రొడ్యూసర్: టీజీ విశ్వ ప్రసాద్
డైరెక్టర్: మారుతి
బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ
నటీనటులు: నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్, యోగిబాబు తదితరులు

ఆగస్టులో భవనమ్



కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన హారర్ కామెడీ 'భవనమ్'. ఆగస్టు 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. నటుడు సప్తగిరి మాట్లాడుతూ 'సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌లో ఓ సినిమా చేయాలనే కల 'భవనమ్'తో నెరవేరింది' అన్నారు. ఇందులో కామెడీ యాక్షన్ సాంగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని షకలకశంకర్ చెప్పారు. సినిమాను చాలా గ్రిప్పింగ్‌గా తెరకెక్కించాం, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు బాలాచారి తెలిపారు.

చిత్రం: భవనమ్
ప్రొడ్యూసర్: ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి
డైరెక్టర్: బాలాచారి కూరెళ్ల
బ్యానర్: సూపర్‌గుడ్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్
నటీనటులు: సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, తాగుబోతు రమేశ్, మాళవిక సతీషన్ తదితరులు

ఉషా పరిణయ గాథ



ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సాయిదుర్గ తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త నటీనటీలతో రూపొందుతున్న ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, ఈ తరహా చిత్రాలు మరిన్ని వస్తాయి అని సాయిదుర్గతేజ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా కుటుంబం మద్దతుతో ఈ చిత్రాన్ని నిర్మించాను. ధ్రువన్ మంచి సంగీతం అందించాడు' అన్నారు. అందరి సహకారంతో ఓ మంచి సినిమాను అందిస్తున్నాం, సినిమా చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు అని హీరో చెప్పారు. ఈ సినిమాతో నటిగా నాకు మంచి పేరు వస్తుందని హీరోయిన్ చెప్పారు.

చిత్రం: ఉషా పరిణయం
ప్రొడ్యూసర్: కె. విజయ్ భాస్కర్
డైరెక్టర్: కె. విజయ్ భాస్కర్
బ్యానర్: విజయ్ భాస్కర్ క్రాఫ్ట్స్ ప్రొడక్షన్
నటీనటులు: శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య

బడ్డీ టికెట్ ధరల తగ్గింపు



అడ్వంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బడ్డీ'. ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో బడ్డీ సినిమా రేట్లను తగ్గిస్తున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు. సింగిల్ స్క్రీన్లలో రూ. 99, మల్టీప్లెక్స్‌లో రూ. 125గా టికెట్ ధరలు నిర్ణయించారు. భారతీయ వెండితెరపైన ఒక సరికొత్త ప్రయోగంగా 'బడ్డీ' సినిమా నిలుస్తుందని ఈ సందర్భంగా మేకర్స్ తెలిపారు.

చిత్రం: బడ్డీ
ప్రొడ్యూసర్: కేఈ జ్ఞానవేల్ రాజా, అధన్ జ్ఞానవేల్ రాజా
డైరెక్టర్: శామ్ ఆంటోన్
బ్యానర్: స్టూడియో గ్రీన్ ఫిలింస్
కాస్టింగ్: అల్లు శిరీష్, గాయత్రి భరద్వాజ్, అజ్మల్ అమీర్, అలీ, ముఖేశ్ కుమార్ తదితరులు

సీనియర్ సినీ నిర్మాత సూర్యనారాయణబాబు కన్నుమూత



సీనియర్ నిర్మాత, మహేశ్‌బాబు మేనమామ ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. సూపర్‌స్టార్ కృష్ణకు బావ అయిన సూర్యనారాయణ బాబు 'మనుషులు చేసిన దొంగలు', 'రామ్ రాబర్ట్ రహీమ్', 'సంధ్య', 'బెజవాడ రౌడీ' తదితర చిత్రాలు నిర్మించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుడివాడ నియోజక వర్గం నుంచి ఎన్టీఆర్ పై పోటీ చేసి ఓడిపోయారు. నటుడు విజయ్‌చందర్‌తో కలిసి ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా 'కలియుగ విశ్వామిత్ర' చిత్రాన్ని కూడా నిర్మించారు. సూర్యనారాయణ బాబు పార్థీవ దేహాన్ని మంగళవారం ఉదయం కోకాపేటలోని మూవీ టవర్స్‌లో ఉంచి, ఆ తర్వాత మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు.



తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దర్శక సంజీవని పేరుతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఉపాధ్యక్షుడు సాయి రాజేశ్, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా పరిష్కరించండి

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 205 వినతులు ● స్వీకరించిన ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

కలెక్టరేట్: ప్రజల నుంచి వస్తున్న వినతులు నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రీఓపెన్ అయిన వాటిని నిర్ణయించిన గడువులోగా పంపాలని, ఆన్‌లైన్‌లో కూడా పెండింగ్ కనిపించకూడదన్నారు. ఎన్నికల ముందు వచ్చిన వినతులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ సమస్యలపై 205 వినతులు వచ్చాయి. వీటిని జేసీ కార్తీక్, డీఆర్వో అనిత, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ సుమబాల తదితరులు స్వీకరించారు. రెవెన్యూ శాఖ సమస్యలపై 135 వినతులు, డీఆర్‌డీఏకు 17, డీపీవో 15, వైద్య శాఖకు సంబంధించి 7, మున్సిపల్ శాఖ 16కు చొప్పున వినతులు వచ్చాయి.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలి

విజయనగరం పట్టణంలోని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని విజయనగరం టీడీపీ నాయకులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినత పత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, కనకల మురళీమోహన్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

● జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేయాలంటూ ఏఐఎస్ఎఫ్ నాయకులు విన్నవించుకున్నారు. గత ప్రభుత్వం జూనియర్ కాలేజీల్లో ఉన్న మధ్యాహ్న భోజన పథకం నిలిపివేసిందని, దీని వల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే వారి సంఖ్య తగ్గింది. వెంటనే అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు.

● జిల్లాలోని చాకిరేవు భూములపై హక్కులు కల్పించాలని జిల్లా రజక సంఘ నాయకులు వినతిపత్రం సమర్పించారు. భూముల విలువ పెరగడంతో రియల్ ఎస్టేటు వ్యాపారం పెరగడంతో చాకిరేవు స్థలాలను దౌర్జన్యంగా అక్రమించుకున్నారన్నారు. జిల్లాలోని దోబీ పోస్టులను భర్తీ చేయాలని, స్థానిక సంస్థల్లో షాపులు కేటాయించాలని, బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సొసైటీలు నిర్మించాలంటూ సంఘనాయకులు ముత్యాలు పైడిరాజు, మద్ది అప్పలరాజు కోరారు.

● పూసపాటిరేగ మండలం కోనాడ గ్రామంలో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నవారిపై చర్యలు తీసుకోవాలంటూ అదే గ్రామానికి చెందిన బి.ఎల్లాజీ వినతి పత్రం సమర్పించారు. గ్రామంలోని సర్వే నెంబరు 105 పరిసర ప్రాంతాల్లో ఉన్న భూమితో పాటు 44-2 సర్వే నెంబరులో ఉన్న భూమిని ఒక వ్యక్తి అక్రమించుకున్నారు. వెంటనే దీనిపై విచారణ చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ కోరారు.



వినతులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గుర్ల, జూలై 29: ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ భాస్కరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కెళ్ల గ్రామానికి చెందిన అంపోలు అప్పలనాయుడు(31) గ్రామంలో వ్యవసాయం కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల అతని భార్య లచ్చుమాంబ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో ఆమెకు ఏమవుతుందోనని ఆందోళనతో మనస్తాపం చెంది రెండు రోజులక్రితం గడ్డిమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ భాస్కరరావు తెలిపారు.

నల్ల ఇసుక సీజ్



నల్ల ఇసుకను సీజ్‌చేసిన అధికారులు

పూసపాటిరేగ, జూలై 29: కొల్లాయివలస రెవెన్యూ పరిధిలో అక్రమంగా నిల్వచేసిన నల్ల ఇసుకను పోలీసులు ఆదివారం సీజ్‌చేశారు. కొందరు స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిల్వలను గుర్తించి ఆదివారం అధికారులు పట్టుకున్నారు. స్థానిక ఎస్ఐ సన్యాశినాయుడు, పోలీసులతో పాటు అటవీశాఖ అధికారులు, మైనింగ్ అధికారులతో పాటు, రెవెన్యూ అధికారులు సముద్రపు నల్లని ఇసుక నిల్వలు సుమారుగా 8యూనిట్లను సీజ్‌చేసి కేసును నమోదు చేశారు. ఇందులో ప్రత్యేక లవణాలు ఉన్న కారణంగా అక్రమంగా ఎక్కువ మొత్తానికి తరలిస్తున్నారు. వీటిని సీజ్‌చేసి పరీక్షల నిమిత్తం మైనింగ్ అధికారులు తీసుకువెళ్లారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించి అక్రమ తరలింపుకు పాల్పడ్డవారిపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

సమస్యలపై తక్షణం స్పందించండి

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం: జిల్లాలోని పోలీసు స్టేషన్‌లకు వచ్చే బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి 35 ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి.. ఫిర్యాదీకి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలకు సంబంధించి నాలుగు ఫిర్యాదులు, భూ తగాదాలకు 13, మోసాలకు పాల్పడినట్టు 8 ఫిర్యాదులు, ఇతర విషయాలకు సంబంధించినవి 9 ఫిర్యాదులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అష్మాపరహీన్, డీఎస్పీ వీరకుమార్, సీఐలు నర్సింహమూర్తి, ఎస్ఐ మురళి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

గ్లోబల్ టైగర్స్‌డేలో బేబీనాయన

● మంగళగిరిలో పవన్‌కల్యాణ్‌తో కలిసి పాల్గొన్న బొబ్బిలి ఎమ్మెల్యే

బొబ్బిలి, జూలై 29: గ్లోబల్ డే సందర్భాన్ని పురస్కరించుకుని మంగళగిరి అరణ్యభవన్‌లో డిప్యూటీ సీఎం, అటవీశాఖామాత్యులు పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన)కు ప్రత్యేక గుర్తింపు లభించింది. వన్యప్రాణుల ప్రేమికుడైన బేబీనాయనను గ్లోబల్ టైగర్స్‌డే కార్యక్రమంలో పాల్గొనాలని పవన్‌కల్యాణ్ స్వయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బేబీనాయన స్వయంగా వన్యప్రాణులకు తీసిన ఫోటోలతో అక్కడ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. దీనిని పవన్‌కల్యాణ్ ఆసక్తిగా తిలకించారు. బాంధవగడ్, తడోబా, కన్హా జాతీయ పార్కులకు ఏటా వెళ్లి అక్కడ వన్యప్రాణుల ఫోటోలను సజీవంగా కెమేరాలో బంధించిన తీరును బేబీనాయన వివరించారు. అటవీ విస్తీర్ణం పెంచాలని పెద్దపులుల ఆహారిత జీవులైన దుప్పుకణుతులు, అడవిపందులు తదితర జంతువుల సంఖ్యను పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు బేబీనాయన తెలిపారు. దేశవిదేశాల నుంచి పర్యాటకులను ఆకట్టుకునేందుకు అవసరమైన వైల్డ్‌లైఫ్ టూరిజమ్ పథకాలను అమలు చేయాలన్న తన సూచనకు పవన్‌కల్యాణ్ స్పందించడంపై బేబీనాయన హర్షం వ్యక్తం చేశారు.



ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న పవన్‌కల్యాణ్, బేబీనాయన

ఇంటింటి కొళాయిలకు శంకుస్థాపన

లక్కవరపుకోట, జూలై 29: మండలంలోని రంగారాయపురంలో గ్రామంలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటింటి కుళాయిలకు శంకుస్థాపన చేశారు. మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండల టీడీపీ-జనసేన నాయకులు భారీ ఎత్తున హాజరయ్యారు. జలజీవన్ మిషన్ ద్వారా రంగారాయపురం గ్రామంలో 420 కుళాయి పాయింట్లకు రూ.31.90లక్షలు, వెంకన్నపాలెం గ్రామానికి 802 కనెక్షన్లకు రూ.9.90లక్షల నిధులు విడుదలయ్యాయని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ పైడిరాజు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రభుత్వం వచ్చాక జలజీవన్ మిషన్ ద్వారా పనులకు మోక్షం కలిగిందన్నారు. అనంతరం కార్యకర్తలు, నేతలతో కలిసి విశాఖ ఎంపీ శ్రీభరత్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ.రాంప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు చొక్కాకుల మల్లునాయుడు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శంకుస్థాపన పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల

సీఎం సహాయనిధి నుంచి రూ.12 లక్షలు మంజూరు

బొబ్బిలి, జూలై 29: బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని తెర్లాం మండలం నెమలాం గ్రామానికి చెందిన బొమ్మరిల్లు శ్రావణ్‌కుమార్‌కు శస్త్ర చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి 12 లక్షల రూపాయల చెక్కు మంజూరైంది. శ్రావణ్ కుమార్ తండ్రి చంద్రమౌళి అభ్యర్థన మేరకు స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన సీఎం చంద్రబాబు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం ఆర్థిక సహాయాన్ని మంజూరు చేశారు. ఈ చెక్కును సెక్రటేరియట్‌లో బాధితుని తండ్రి చంద్రమౌళికి బేబీనాయన అందజేశారు.

ముగిసిన శిక్షా సప్తాహ్

లక్కవరపుకోట (వేపాడ): మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారంతో ముగిశాయని ఎంఈవో పి.బాలబాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పాఠశాలల్లో విందు భోజనాలు ఏర్పాటు చేశామని, వారం రోజులపాటు సాగిన ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగ పడిందన్నారు. చాలా మంది దాతలు ఈ కార్యక్రమానికి సహకరించారన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

కొత్తవలస: సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని శృంగవరపుకోట మాజీ శాసన సభ్యుడు కడుబండి శ్రీనివాసరావు కోరారు. సోమవారం కొత్తవలసలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్సు పథకాలను ప్రచారం చేశారని, వీటిలో ఇప్పటికే కొన్ని అమలులోకి వచ్చినా మరికొన్ని పథకాలు ఇంకా అమలులోకి రాలేదని, మిగిలిన హామీలను కూడా అమలు చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ గొరపల్లి జయప్రకాష్, మండల వైసీపీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపైనే అధిక ఫిర్యాదులు

రామభద్రపురం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భూసమస్యల పరిష్కారానికే అధిక ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తెలిపారు. భూసర్వేలో తప్పులు అనేకం ఉండడంతో ఈ భూసమస్యలు అధికమయ్యాయని ఆమె తెలిపారు. సర్వేయర్ల సహకారంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. అనంతరం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమలప్రసాద్, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

పరిష్కార వేదికకు ఒకే ఒక్క ఫిర్యాదు

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒకే ఒక్క ఫిర్యాదు వచ్చినట్టు ఎంపీడీఓ శ్యామలాకుమారి తెలిపారు. మండలంలో 25 సచివాలయాలు, 39 పంచాయతీలు ఉన్నాయి. ఒక్క సంకిలి సచివాలయం నుంచి పాలనపరమైన సమస్యను అప్పాపురం సర్పంచ్ ప్రతినిధి కరణం నిర్మలా శ్రీనివాసరావు అధికారుల దృష్టికి తెచ్చారు.

గిరిజన గ్రామంలో న్యాయ అవగాహన సదస్సు

బొబ్బిలిరూరల్: మండలంలోని చిత్రకోటబొడ్డవలస గ్రామంలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు, వైద్యశిబిరం నిర్వహించారు. పిరిడి పీహెచ్‌సీ డాక్టర్ వీఎస్‌కే రఘువంశీ, డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులను ఉచితంగా అందజేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గిరిజన మహిళలు, పిల్లల ఆరోగ్యంపై వారికి పలు అంశాలను వివరించారు. చిన్నపిల్లల డాక్టర్‌కె.శివ, సర్పంచ్ పి.వెలంగిరి, పంచాయతీ కార్యదర్శి ఆరిశెట్టి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

217 జీవో రద్దుపై మత్స్యకారుల సంబరాలు

రాజాం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలులో భాగంగా మత్స్యకారుల జీవనోపాధికి గుదిబండగా మారిన 217 జీవోను ప్రభుత్వం రద్దు చేయడంతో సోమవారం రాజాంలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. పట్టణంలో చిన్న చెరువు గట్టువద్ద సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచిపెట్టారు. మత్స్యకారుల నియోజకవర్గ అధ్యక్షుడు బెహరా తవుడు మాట్లాడుతూ లక్షలాది మంది మత్స్యకారుల పొట్టకొట్టి రోడ్డున పడేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 217 జీవోను తీసుకువచ్చింద న్నారు. ఈ జీవోను రద్దుతో మత్స్యకారులకు మంచి రోజులు వచ్చాయని ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ పట్టణ నాయకుడు ఉరిటి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నగరంలో త్రీ టౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలి

విజయనగరం రూరల్: విజయనగరం జనాభా పెరగడంతో పాటు.. నగర పరిధి విస్తరిస్తున్న నేపథ్యంలో త్రీ టౌన్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పోలీసు ఉన్నతాధికారులకు పంపించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కోరారు. సోమవారం ఆమె ఎస్పీ వకుల్ జిందాల్‌ని ఆయన ఛాంబర్లో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అపార్టుమెంటులు, శివారు కాలనీలు గత పదేళ్లతో పోల్చితే ఎక్కువయ్యాయన్నారు. ప్రస్తుతం ఉన్న పోలీ సులకు పనిభారం కూడా విపరీతంగా పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో త్రీ టౌన్ పోలీసు స్టేషన్ ఏర్పాటు ప్రతిపాదనను ఉన్నతాధికారులకు పంపించి, ఏర్పాటయ్యే విధంగా కృషి చేయాలన్నారు. అదే విధంగా నగరంలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపాలని, వాటి నియంత్రణకు కఠిన చర్యలు అవలం భించాలన్నారు.

ముగ్గురు విద్యార్థులకు ఆర్థిక సాయం

కలెక్టరేట్: జిల్లాలోని ప్రతిభావంతులైన ముగ్గురు విద్యార్థులకు ఉన్నత విద్యకోసం ఓ ప్రైవేటు సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. దీనిని సోమవారం ఇన్‌చార్జి కలెక్టరు కార్తీక్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు.

31 వరకు గడువు

లక్కవరపుకోట (వేపాడ): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు ఈ నెల 31వరకు గడవు ఉందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కిలపర్తి అప్పారావు తెలిపారు. సోమవారం ఆయన తమ సిబ్బందితో కలిసి విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు.

ఎంపీ శ్రీభరత్ పుట్టినరోజు వేడుకలు

శృంగవరపుకోట: శృంగవరపుకోట గాయత్రి దేవి ఆలయం వద్ద ఉన్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ కార్యాలయంలో సోమవారం విశాఖ ఎంపీ శ్రీభరత్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్, నాయకులు జుత్తాడ రామసత్యం, ఎం.మంగరాజు తదితరులు కేక్ కట్‌చేసి, ఒకరికొకరు పంచుకున్నారు.

జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మణరావు

కొత్తవలస: జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడిగా లక్ష్మణరావు ఎన్నికయ్యారని సంఘం ప్రతినిధి క్రిసూర్య నూకరాజు సోమవారం తెలిపారు. ఈ ఎన్నిక ఉమ్మడి విజయనగరానికి సంబంధించి జరిగిందన్నారు. ప్రధాన కార్యదర్శిగా బీ.వి. అప్పారావు(కొత్తవలస), కోశాధికారిగా పి.సాగర్(గుమ్మలక్ష్మీపురం), ఉపాధ్యక్షుడిగా జి.గోపాలకృష్ణ(పార్వతీపురం) తదితరులను ఎన్నుకున్నామన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో సోమవారం వనమిత్ర కృష్ణదాస్ వృద్ధ మాతృ మూర్తులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా కాశీ విశ్వేశ్వర ఆలయం ప్రాంగణంలో చీరలు వితరణ చేశామని తెలిపారు.

తహసీల్దార్‌గా ధర్మారావు

వంగర: వంగర తాహసీల్దార్‌గా డి.ధర్మారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన తాహసీల్దార్ చిరంజీవి జిల్లా కేంద్రంకు బదిలీ కావటంతో ఈయన నియమితులయ్యారు. ఈయన గతంలో నెలిమర్ల తాహసీల్దార్‌గా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలు సక్రమంగా అందించటానికి కృషిచేయాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: రవా ణాశాఖ విధించిన నిబంధ నల మేరకే ప్రతి ఒక్కరూ ఆటోలు నడపాలని బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు కోరారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్ పక్కన ప్రయాణికులు కూర్చోకుండా చూడాలని, మద్యం సేవించి ఆటోలు నడపడం చట్టరీత్యా నేరమని, అధిక సంఖ్యలో ప్రయాణికులను ఆటోల్లో ఎక్కించవద్దని సూచించారు. ఇటీవల కా లంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగడంతో భద్రత పాటించి వేగంగా వెళ్ల కుండా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి రూరల్ సీఐ సంచాన తిరుమలరావు, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ

మైదాన ప్రాంత గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

● మంత్రి సంధ్యారాణికి వినతి

రాజాం రూరల్, జూలై 29: మైదాన ప్రాంత గిరిజనుల సమస్యల్ని పరిష్కరించాలని కోరుతూ రాజాం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు తిమ్మయ్యపేటకు చెందిన గిరిజనులు రాష్ట్ర శిశు, సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖా మాత్యులు సంధ్యారాణిని కోరారు. ఈమేరకు తిమ్మయ్యపేటకు చెందిన గిరిజనులు గ్రామ దత్తత స్వీకర్త సప్పటి వసంతరావు సారథ్యంలో సాలూరులో మంత్రిని ఆమె స్వగృహంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని వివరించారు. అర్హులైన వారికి పెన్షన్ మంజూరు చేయించాలని, ఇళ్లు లేని ఎనిమిది మందికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహాలు మంజూరు చేయించాలని, రాజాం మున్సిపాలిటీ పరిధిలో ఉండడంతో ఉపాధిహామీ పథకానికి నోచుకోని 50 మంది మహిళలకు స్వయం ఉపాధి కల్పన శిక్షణ కార్యక్రమం నిర్వహించి ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో పాలవలస లక్ష్మి, అన్నపూర్ణ, నూకాలమ్మ, రామ, రవి, పాలవలస బోడన్న తదితరులు ఉన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారంలో మంత్రి సానుకూలంగా స్పందించాలని గ్రామ దత్తత స్వీకర్త సప్పటి వసంతరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న తిమ్మయ్యపేట గిరిజనులు

విద్యాశాఖాధికారులపై చర్యలు తీసుకోవాలి

బాడంగి, జూలై 29: ఎరుకులపాకలు ఎంపీపీ స్కూల్ నుంచి 3, 4, 5 తరగతుల పిల్లలను గజరాయనివలస యూపీ స్కూల్‌కి పంపించడంపై మండల విద్యాశాఖధికారుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తుందంటూ ఎంపీటీసీ పాలవలస గౌరు సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌లో జేసీ కార్తీక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌కు ఇచ్చిన వినతిపత్రంపై స్థానిక విద్యాశాఖాధికారులు స్పందించిన తీరు ఆశ్చర్యంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై జేసీ స్పందిస్తూ గిరిజన విద్యార్థుల భవిష్యత్తు కోసం కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారని తెలిపారు.



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీటీసీ పాలవలస గౌరు

సంఘం నూతన అధ్యక్షుడికి సత్కారం

జామి, జూలై 29: మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన కాపుగంటి రంజిత్ కుమార్‌కు మండల ఆర్యవైశ్యసంఘం సోమవారం ఘనంగా సత్కరించింది. సంఘ అభివృద్ధికి, సమాజసేవ కార్యక్రమాలు చేయాలని నూతన సంఘ అధ్యక్షుడిని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు యిందుపూరి సుబ్బరాజు, కుసుమంచి సురేష్, గాది రాము, కాపుగంటి గాది రాము, పీ.శ్రీనువాసరావు, కృష్ణారావు, రామకృష్ణ తదితరులున్నారు.



రంజిత్‌కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పారిశుధ్యం, తాగునీటి సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్

కలెక్టరేట్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ పారిశుధ్యం, తాగునీటి సమస్యలను వెనువెంటనే పరిష్కరించే లక్ష్యంతో కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టరు కార్తీక్ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో 9502349267 టోల్‌ఫ్రీ నెంబరుతో కంట్రోల్ రూం పని చేస్తుందని డీపీవో శ్రీధర్ రాజా తెలిపారు.

రాజాం రైల్వేలైన్ ఏర్పాటుకు సహకరించాలి

● లోక్‌సభలో ఎంపీ కలిశెట్టి

రాజాం రూరల్: విజయనగరం జిల్లాలోని పారిశ్రామిక పట్టణం రాజాం రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని లోక్‌సభలో ప్రస్తావించినట్లు విజయనగరం ఎం.పి. కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. సోమవారం సాయంత్రం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. పాతికేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైందని, రాజాం ప్రాంత ప్రజల కలలు సాకారం చేసేలా రైల్వే మంత్రి సహకరించాలని లోక్‌సభలో కోరానని ఎంపీ తెలిపారు. దీని వల్ల ఏపీ-ఒడిశా రాష్ట్రాల మధ్య వాణిజ్య, వ్యాపార లావాదేవీలు పెరుగుతాయని, ఇరు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సభ దృష్టికి తీసుకువచ్చినట్లు వివరించారు. వీటితో పాటు జర్నలిస్ట్‌లకు రైల్వేపాసులను పునరుద్ధరించాలని కోరినట్లు తెలిపారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ

రేపు పీడీఎస్ బియ్యం వేలం

రేగిడి: రేగిడి, వంగర మండలాల్లో 6ఏ కేసుల్లో పట్టుబడిన 15 క్వింటాళ్ల బియ్యాన్ని ఈనెల 31న రేగిడి సివిల్ సప్లయిస్ గొడౌన్ వద్ద వేలం వేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ కె.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని డీటీ కోరారు.

కోండ్రుకు కృతజ్ఞతలు

రాజాం: ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో 20వ వార్డుకు చెందిన వివిధ సమస్యలపై ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు వినతిపత్రం అందజేశామని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్ తెలిపారు. ఈ విషయంపై తక్షణమే స్పందించి మున్సిపల్ అధికారులను విచారణకు పంపించారని చెప్పారు. సకాలంలో స్పందించిన కోండ్రుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యందవ కుమారి, సవలాపూరపు శ్యామ్, అంపోలు శ్రీను, తోలేటి బుజ్జి, నాగార్జున, సౌరి, షణ్ముఖ, లాజర్, రామారావు, నాగమ్మ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

విజయనగరం రూరల్: జిల్లా సమతా సైనికదళ్ నూతన కార్యవర్గ ఎన్నిక నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులుగా పొంద్రంకి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రెయ్యి రామకృష్ణ, గౌరవ అధ్యక్షులుగా కౌలు చిరంజీవులు, అధికార ప్రతినిధిగా తవిటి ప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సిమ్మాల దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులుగా రేగిడి రామకృష్ణ, మీడియా కన్వీనరుగా ఎత్తుల ఈశ్వరరావు ఎన్నికయ్యారు.

బండారు లక్ష్మణ్ యాదవ్‌కు అభినందన

విజయనగరం రూరల్: జాతీయ పారా ఒలింపిక్ (విభిన్న ప్రతిభావంతుల) పోటీల్లో విజయం సాధించిన బండారు లక్ష్మణ్ యాదవ్‌ను సోమవారం యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఇసరపు శేఖర్ యాదవ్ సోమవారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఆయనతో పాటు అకాడమీ చైర్మన్ కృష్ణారెడ్డి, దాకవరపు రాము యాదవ్ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

రింగురోడ్డు: మలేరియా, డెంగ్యూ వంటి రోగాలు ప్రబలకుండా ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పారిశుధ్య కార్యదర్శులకు, ఏఎన్‌ఎంలకు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం నాయుడు ఆదేశించారు. సోమవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయల వారిగా పారిశుధ్యపరంగా చేపడుతున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పర్యవేక్షకులు, ఎంహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీ నోటిఫికేషన్ రద్దు

రింగురోడ్డు: ప్రభుత్వ వైద్యకళాశాల ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో పోస్టులకు సం బంధించిన నోటిఫికేషన్‌ను వైద్యవిద్యా సంచాలకులు విజయవాడ వారి ఆదేశానుసారం నిలుపుదల చేస్తున్నట్లు ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మలీల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నగరపాలక సంస్థకు 13 వినతులు

రింగురోడ్డు: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కారవేదికకు 13 వినతులు వచ్చాయి. నగరపాలక సంస్థ కార్యాలయంలో పలువురు తమ సమస్యలను వెల్లడిస్తూ వినతిపత్రాలను కమిషనర్ ఎం.ఎం నాయుడుకు అందచేశారు. ఆయా వినతుల పరిష్కారానికై సంబంధిత విభాగ అధికారులకు కమిషనర్ ఆదేశించారు. ఏసీపీ అమ్మాజీరావు, ఈఈ కె.శ్రీనివాసరావు, ఎంహెచ్‌వో డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలో సోమవారం గ్రామ రైతుసేవా కేంద్ర వ్యవసాయ సహాయకులు రాజశేఖర్ పర్యవేక్షణలో రైతులకు సిడ్లింగ్ రూట్ డిప్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మాధురి, రమ్య, లత, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు గ్రీన్ బెల్ట్ సొసైటీ అభినందన

బొబ్బిలిరూరల్: బొబ్బిలి తహసీల్దారు ఎం.శ్రీనును గ్రీన్‌బెల్ట్ సొసైటీ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ గ్రీన్‌బెల్ట్ పరంగా చేపడుతున్న పలు సామాజిక కార్యక్రమాలను తహసీల్దార్‌కు వివరించారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు వనమిత్ర కృష్ణదాసు, సత్యరాజు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపులకు పాల్పడడం బాధాకరం

విజయనగరం దాసన్నపేట: అధికారంలోకి వచ్చి 50 రోజులు గడవక ముందే టీడీపీ నాయకులు రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడడం బాధాకరమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ధర్మపురిలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెదిరింపులతో, భయపెట్టడంతో పార్టీని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తే, బెదిరేది లేదన్నారు. మాజీ సైనికుడి ప్రహరీని ముందు రోజు నోటీసిచ్చి రెండో రోజు పెద్ద ఎత్తున పోలీసులతో రెవెన్యూ అధికారులు కూలగొట్టారన్నారు. ఇటువంటి చర్యలు మానుకోవాలన్నారు.

శ్మశాన వాటికను కాపాడండి

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన ముస్లింలు తమ శ్మశాన వాటికను కాపాడాలంటూ స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరించేందుకు మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావును పురమాయించారు. ముస్లింల శ్మశానవాటిక అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

'సహారా' డబ్బులు ఇప్పించండి

సహారా ఇండియాలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న ఏజెంట్లు, డిపాజిట్‌దారులు తమ డబ్బు ఇప్పించాలని కోరుతూ సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల ర్యాలీలు చేపట్టారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్లకు వినతిప్రతం అందించారు. దీనిపై స్పందించాలని ప్రభుత్వాన్ని కోరారు.



బొబ్బిలి రూరల్: ఎన్.టి.ఆర్ విగ్రహం వద్ద..



ఎస్.కోటలో సీఐటీయూ ఆధ్వర్యంలో..



రాజాం: ర్యాలీ చేస్తున్న ఏజెంట్లు, డిపాజిట్ దారులు

సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు

సాలూరు: సాగునీటి కాలువల్లో ముమ్మరంగా పూడికతీత పనులు చేపడుతున్నారు. కాలువల్లో పూడికల కారణంగా పంట పొలాలకు నీరందటం లేదని రైతులు పలుమార్లు మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆమె కలెక్టర్‌తో మాట్లాడారు. ప్రత్యేక నిధులు రూ.4.7లక్షలతో పాచిపెంట మండలం కర్రివలస ఆనకట్ట నుంచి సుమారు 11 కిలోమీటర్ల మేర కాలువల్లో పూడిక తీతలు, తూములు శుభ్రపరిచే పనులు చేయిస్తున్నారు. దీనివల్ల సుమారు 12 గ్రామాలకు సంబంధించి 4,500 ఎకరాల భూములకు సాగునీరు అందనుంది. అలాగే మక్కువ మండలంలో వెంగళరాయసాగర్‌కు సంబంధించిన కాలువల్లో పూడిక తీత పనులు చకచకా జరుగుతున్నాయి.

నేడు పెద్దగెడ్డ నుంచి నీరు విడుదల

పాచిపెంట గ్రామంలో ఉన్న పెద్దగెడ్డ నుంచి రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మంగళవారం నీటిని విడుదల చేయనున్నట్టు నీటి పారుదలశాఖ డీఈ కనకారావు సోమవారం తెలిపారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి

పార్వతీపురంటౌన్: ఆసుపత్రి అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌పై నిప్పులు చెరిగారు. సోమవారం స్థానిక వైద్య విధాన పరిషత్ ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ కె.శ్రీనివాసరావుతో పాటు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు జిల్లా ఆసుపత్రి అభివృద్ధి పనుల పరిశీలనకు వచ్చారు. ఈసందర్భంగా ఆమె ఎస్‌ఈతో పాటు ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. గత కొన్నేళ్లుగా ఆసుపత్రి అభివృద్ధి చేపట్టినా సంబంధిత కాంట్రాక్టర్ అశ్రద్ధ వల్ల కొన్ని గదుల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండిపోయాయని ఇంజినీరింగ్ అధికారులకు తెలిపారు. అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోయిన కాంట్రాక్టర్‌పై వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. రోగు గదులు సిద్ధం చేయాలన్నారు. దీనికి ఎస్‌ఈ సమాధానమిస్తూ కొన్ని నెలల్లోనే ఆసుపత్రి అభివృద్ధి పనులను సంబంధిత కాంట్రాక్టర్‌తో చేయించి అప్పగిస్తామని హామీ ఇచ్చారు.

తాగి వాహనం నడిపితే ఆరు నెలల జైలు



మాట్లాడుతున్న సివిల్ న్యాయాధికారి

సీతంపేట: తాగి వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారకులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని పాలకొండ సివిల్ న్యాయాధికారి విజయరాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం సీతంపేట కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయవిజ్ఞాన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వీటిని నివారించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిలో భాగంగా తాగి వాహనాలు నడిపినవారికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే మూడేళ్ల జైలు శిక్ష, లైసెన్స్ రద్దు చేస్తారని తెలిపారు. బండికి ఇన్సూరెన్స్, వాహనదారుడికి లైసెన్స్ లేని పక్షంలో మూడు నెలలు జైలు విధిస్తారని వివరించారు. ఈకార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సారా స్వాధీనం

సాలూరు రూరల్: మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో ఎస్ఐ ఎం.వెంకటరమణ సోమవారం దళాయివలస తదితర ప్రాంతాలకు నిఘా కోసం వెళ్లారు. ఈక్రమంలో తనిఖీలు చేస్తుండగా ఏవోబీ కొండల నుంచి అక్రమంగా సారా తరలిస్తున్న దిగువ మెండంగికి చెందిన మచ్చ జమ్మయ్య అనే వ్యక్తి పట్టుబడ్డాడు. బైకుపై నాలుగు క్యానల్లో సారాను నింపుకొని వస్తున్న అతనిని అడ్డగించి తనిఖీ చేశారు. 80లీటర్ల సారాను గుర్తించారు. సారాతో పాటు బైకును స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు న్యాయం చేయండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: సాలూరు పట్టణ మూడో అంగన్‌వాడీ కార్యకర్త బలగ రాధను స్థానికంగా ఉన్న కార్యకర్తలు (ఇరువురు) వేధిస్తున్నారని, వెంటనే దానిపై విచారణ చేసి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు కోరారు. సోమవారం ఉదయం జేసీ శోభికకు వినతిపత్రం సమర్పించారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

స్థానికులకు అవకాశమివ్వండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఏకలవ్య పాఠశాలల్లో స్థానికులకే ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీ జేఏసీ నాయకులు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు లేఖ రాశారు. ఆ సంఘ నాయకులు దుక్క సీతారాం, ఎం.నారాయణరావు తదితరులు మాట్లాడుతూ మన రాష్ట్రానికి చెందిన వారికే పాఠశాలల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మల్లయ్య, రామారావు, సి.హెచ్.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

సాలూరు: ఎప్పటికప్పుడు మారుతున్న చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పట్టణ సీఐ వాసునాయుడు సూచించారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మారుతున్న చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. గంజాయి, మత్తు పదార్థాలు వాడటం వల్ల కలిగే నష్టాలను ఆయన విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రుచికరమైన భోజనం పెట్టాలి

సాలూరు: విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని, మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ పి.ప్రసన్నవాణి ఆదేశించారు. పట్టణంలోని డబ్బివీధిలో ఉన్న పురపాలక పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సహపంక్తి భోజనాలు

- ముగిసిన శిక్షా సప్తాహ్

కురుపాం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ ముగింపులో భాగంగా శుభదిన్ భోజన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. హెచ్ఎం తోట శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** తలవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ తిథి భోజనం సోమవారం నిర్వహించారు. హెచ్ఎం వై.జగన్ ఆధ్వర్యంలో యూత్ సభ్యుల ఆర్థిక సహాయంతో సుమారు 350 మందికి భోజనలు ఏర్పాటు చేశారు. ● అంపిలి ఎంపీపీ పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు పాల్గొన్నారు. ● **వీరఘట్టం:** శిక్షా సప్తాహ్ వారోత్సవాలు కార్య క్రమం ముగింపు సందర్భంగా వీరఘట్టంలోని కూరాకుల బీసీ కాలనీ, కోమటివీధి, అగ్రహారంవీధి, బాయ్స్ అండ్ గర్ల్స్ ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 800 మంది విద్యార్థులకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ, నాయకుడు బల్ల హరిబాబు ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ● **గరుగుబిల్లి:** ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు సోమవారం ముగిశాయి. స్థానికులు, తల్లిదండ్రుల కమిటీలు, ఉపాధ్యాయ సంఘాల సహకారంతో విద్యార్థులతో సహపంక్తి భోజనాలు చేశారు. గొట్టివలస పాఠశాల విద్యార్థులకు కొత్తూరు క్లస్టర్ రిసోర్స్‌పర్సన్ బోను రామకృష్ణ సామగ్రిని అందించారు. చిలకాం పాఠశాలకు ఉపాధ్యాయులు కె.రామ్‌మోహన్‌రావు, గుల్ల సూర్యనారాయణ వివిధ రకాల సామగ్రిని అందించారు. ఉల్లిభద్రలో సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, టీడీపీ ప్రతినిధి మరడాన నారాయణస్వామి సామగ్రిని అందించారు.



కురుపాం: సహపంక్తి భోజనాలు చేస్తున్న దృశ్యం

మా భూములు ఇప్పించండి

- కలెక్టరేట్ ముట్టడిని అడ్డుకున్న పోలీసులు
- రహదారిపై బైఠాయించిన శివ్వాం దళిత కుటుంబాలు

పార్వతీపురంటౌన్: తమ భూములను పెత్తందారుల స్వాధీనం నుంచి తమకు ఇప్పించాలని గరుగుబిల్లి మండలం శివ్వాం గ్రామానికి చెందిన పలువురు దళితులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి నుంచి కలెక్టర్ వరకు ర్యాలీ నిర్వహించారు. చర్చివీధి కూడలి వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఆగ్రహంతో రహదారిపై బైఠాయించారు. ఇంతలో డీఎస్పీ సునీల్ షారోన్ అక్కడకు వచ్చి, నిరసనను విరమించాలని కోరారు. కలెక్టర్‌తో పాటు రెవెన్యూ ఉన్నతాధికారులు తమకు స్పష్టమైన హామీ ఇస్తే గానీ ఇక్కడ నుంచి కదిలే ప్రసక్తే లేదని దళితులు పట్టుబట్టారు. దీంతో ఆర్డీవో హేమలత నిరసన వద్దకు చేరుకుని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో దళితులు శాంతించారు. ఈ నిరసన కార్యక్రమంలో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

గరుగుబిల్లి: శివ్వాం గ్రామానికి చెందిన దళితులపై దాడులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలంటూ కొద్ది రోజులుగా రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈనెల 29న వివిధ సమస్యలపై చలో కలెక్టరేట్ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక, కేవీపీఎస్, గిరిజన సంఘాల పిలుపు మేరకు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారన్న సమాచారంతో ఎస్ఐ వై.అమ్మన్నరావు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. పార్వతీపురం వైపు వెళ్లే ప్రతి వాహనాన్నీ తనిఖీ చేసి విడిచి పెట్టారు. ఈసందర్భంగా ఎస్ఐ అమ్మన్నరావు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. కలెక్టరేట్ ప్రాంతంలో ఉద్రిక్తత తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు.

హౌస్‌అరెస్టులు అన్యాయం

పాలకొండ: అక్రమ హౌస్ అరెస్టులు అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అన్నారు. శివ్వాం గ్రామ దళితుల భూ సమస్యను పరిష్కరించాలని, దళితులపై దాడిచేసిన పెత్తందారులను అరెస్టు చేయాలని జూలై 15వ తేదీ నుంచి జూలై 28వ తేదీ వరకు 15 రోజుల పాటు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టామని తెలిపారు. అయితే సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి వెళ్లనీయకుండా ఆదివారం సాయంత్రం నుంచి హౌస్ అరెస్టులు చేశారన్నారు. గిరిజన, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులను పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు.



పార్వతీపురంటౌన్: ఆర్డీవోకు సమస్యను వివరిస్తున్న నాయకులు

ప్రజల సహకారంతోనే అభివృద్ధి: కలెక్టర్

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రజల సహకారం ముఖ్యమని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్జీదారుల సమస్యను ఓపికతో వినాలని అన్నారు. సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జాయింట్ కలెక్టర్ శోభిక, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎస్.సేదు మాధవన్, ఆర్డీవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై..

పార్వతీపురం రూరల్: అడ్డాపుశీల పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య సమస్యను పరిష్కరించాలని మాజీ ఎంపీపీ గొట్టాపు వెంకట నాయుడు కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో మాధవన్‌కు వినతి పత్రం అందజేశారు. టీడీపీ నాయకుడు అక్కేన శివ పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్స్ సమస్యలు పరిష్కరించండి

కురుపాం: ట్రాన్స్‌జెండర్స్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ పీవో ఎస్.మాధవన్‌కు వినతిపత్రం అంజేసినట్టు ట్రాన్స్‌జెండర్స్ అధ్యక్షురాలు ఎ.గీతారాణి తెలిపారు. ట్రాన్స్‌జెండర్స్ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరారు. ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని, జీవనోపాధి కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు తెలిపారు. త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీవో హామీ ఇచ్చారు.

ఐటీడీఏ స్పందనకు 92 వినతులు

సీతంపేట: ఐటీడీఏ ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 92 వినతులు వచ్చినట్టు పీవో టి.రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో చిన్నబాబు, డివిజనల్ పంచాయతీ అధికారి గోపాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, డీడీ అన్నదొర, ట్రాన్స్‌కో ఈఈ కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ఢిల్లీరావు, ఉపవిద్యా శాఖాధికారి పి.నారాయుడు తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, పీవో

ధ్రువపత్రం ఇప్పించండి

సీతంపేట: రేగులగూడ గ్రామానికి చెందిన ముఖలింగం అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం 14 ఏళ్ల వయస్సు వచ్చినప్పటికీ ఇంతవరకు దివ్యాంగుల సర్టిఫికెట్ చేయించుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీని మూలంగా పింఛన్‌కు నోచుకోవడం లేదని ముఖలింగం తల్లి అప్పలమ్మ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కారంలో పీవో రాహుల్‌కుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. దీనిపై పీవో సానుకూలంగా స్పందించారు. ఐటీడీఏలో సదరం క్యాంప్ నిర్వహించి గిరిజన వికలాంగులకు సర్టిఫికెట్ అందజేసే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే జగదీశ్వరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ శెట్టి పద్మావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని అన్నారు. ఐసీడీఎస్, విద్యుత్ సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కురుపాం మండల పరిషత్ కార్యాలయానికి ఎమ్మెల్యేగా జగదీశ్వరి మొట్టమొదటి సారిగా వచ్చిన సందర్భంగా ఎంపీడీఓ అప్పారావు, సిబ్బంది సత్కరించారు.

ఏనుగులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

జియ్యమ్మవలస: మండలంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపును సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు అటవీ శాఖ అధికారులు తీసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సూచించారు. సోమవారం మండలంలో ఏనుగుల గుంపు సంచరిస్తున్న కుదమ, కుందరతిరువాడ పంచాయతీల పరిధిలో పంట నష్టాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని అటవీశాఖ అధికారులకు సూచించామన్నారు. ఈ పరిశీలనలో టీడీపీ ప్రతినిధులు డొంకాడ రామకృష్ణ, కోల రంజిత్‌కుమార్, పల్ల రాంబాబు, గురాన శ్రీరామ్మూర్తినాయుడు, వెంపటాపు భారతి, ముదిలి రామకృష్ణలు పాల్గొన్నారు.

సక్రమంగా ఖర్చు చేయండి

జియ్యమ్మవలస: ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పైసా సక్రమంగా ఖర్చు చేసి ప్రగతి సాధించాలని ఎంపీపీ బొంగు సురేష్ మహిళలకు సూచించారు. సోమవారం వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పల్లి రాజేశ్వరి అధ్యక్షతన వీవోఏలు, గ్రామైక్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ముందుగా ఎంపీపీని సన్మానించారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డి.రామకృష్ణ, వైస్ ఎంపీపీ నరేష్, ఏపీఎం ఎం.నాగభూషణరావు, సీసీలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను వినియోగించుకోండి

- డ్వామా పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి: గ్రామాల్లోని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉపాధి హామీ పథకంలో పలు అవకాశాలు కల్పిస్తున్నామని జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ పరిధిలో మినీ గోకులాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపడుతోందని చెప్పారు. వివరాలకు సమీపంలోని పశు వైద్య కేంద్రాలు, రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. జిల్లాలో పలుచోట్ల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో సీతంపేట క్లస్టర్ అదనపు సంచాలకుడు గుంట్రెడ్డి శ్రీహరినాయుడు, ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఏపీవో మండల గౌరీనాథ్ పాల్గొన్నారు.

బొమ్మల బెడద తప్పింది

గరుగుబిల్లి: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌రెడ్డి బొమ్మలతోనే పథకాల నిర్వహణ జరిగిందని, కూటమి ప్రభుత్వం చొరవతో బొమ్మల బెడద తప్పిందని టీడీపీ అరకు బీసీ సెల్ చైర్మన్ బూరాడ రామ్‌మోహన్‌రావు అన్నారు. సోమవారం గరుగుబిల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యాశాఖలో అమలు చేస్తున్న పథకాలకు మహనీయుల పేర్లను పెట్టడం అభినందనీయమన్నారు.

చాకిరీ చేయించుకుని.. జీతాలు ఇవ్వరా?

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్యకళాశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులతో చాకిరీ చేయించుకొని సంబంధిత కాంట్రాక్టర్లు జీతాలు, సదుపాయాలను కల్పించడం లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

ఒడిశా

కొల్నార సమితిలో వినతుల స్వీకరణ

రాయగడ: కొల్నార సమితిలో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అధ్యక్షతన జిల్లా యంత్రాంగం సోమవారం వినతుల స్వీకరణ కార్యక్రమం చేపట్టింది. 96మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. వాటిని పరిశీలించిన కలెక్టర్.. ఒకరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మిగతా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ హరీష్ బీసీ, డీఎఫ్‌వో సచిన్ అహెనాసాహెబ్‌ఒహెల్, జడ్పీ ముఖ్య కార్య నిర్వాహణాధికారి నిహార్ రంజన్ కహార్, డాక్టర్ లాల్‌మోహనా రౌత్రాయ్, ఆర్డీవో శివశంకర్ చౌదరి, డీపీఆర్‌వో బసంతకుమార్ ప్రధాన్, అధికారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

రాయగడ: చందిలి పోలీసులు సోమవారం 13 మంది జూదరులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చందిలి పోలీసుస్టేషన్ పరిధి కరలకోన గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నట్టు తెలుసుకుని పోలీసులు దాడి చేశారు. 13 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.లక్షా 60వేల 900 నగదు 13 సెల్‌ఫోన్లు, 6 బైకులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

గంజాయి స్వాధీనం

రాయగడ: స్థానిక రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేయడానికి ప్రయత్నించిన ఓ యువకుడిని రాయగడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయం సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. రాణా ఎస్ఐ ఆర్‌ఎం ముదిలి తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా స్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగున్న ఓ యువకుడిని పట్టుకున్నారు. సోదా చేయగా, యువకుడి వద్ద పాలి థిన్ బ్యాగులో ఉన్న 13 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మెజిస్ట్రేట్ సమక్షంలో గంజాయిని సీజ్ చేశారు. నిందితుడు రాయగడ జిల్లా గుడారి సమితి పోలీసు స్టేషన్ పరిధి సరిగుడ గ్రామానికి చెందిన చందన ఉలకా(26)గా గుర్తించారు. నిందితుడిని కోర్టుకు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సిటీస్కాన్ సేవలు

రాయగడ: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సిటీస్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సోమవారం సిటీస్కాన్ యంత్రాన్ని ప్రారంభించారు. ఆసుపత్రి ముఖ్య వైద్యాధికారి లాల్‌మోహన్ రౌత్రాయ్, ఇతర వైద్యులు పాల్గొన్నారు. సిటీస్కాన్ సేవలు 24 గంటలు అందజేస్తామని తెలిపారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

గరుగుబిల్లి: మండలంలోని రైతులకు ఖరీఫ్‌కు సంబంధించి పూర్తిస్థాయిలో ఎరువులను అందుబాటులో ఉంచామని వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. అధిక ధరలకు ఎరువుల అమ్మకాలు చేస్తే సమాచారం అందించాలన్నారు. ● **సీతంపేట:** రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖాధికారి ప్రియా శ్రీదేవి తెలిపారు. పెదరామ, దారపాడు, మానాపురం, కిల్లాడ, కడ్డపల్లి, కుశిమి, హడ్డుబంగి, కె.గుమ్మడ, మర్రిపాడు, శంబాం రైతు సేవా కేంద్రాల్లో గిరిజన రైతులకు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ● **మక్కువ:** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బొత్స శ్రీనివాసరావు అన్నారు. విలేకరులతో సోమవారం మాట్లాడారు. ప్రైవేటు డీలర్లు ఎవరైనా అధిక ధరలకు అమ్మితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్య క్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** మండలంలోని రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సి.హెచ్. ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. యూరియా 274 టన్నులు, డీఏపీ 115 టన్నులు రాగా ఇప్పటివరకు 177 టన్నులు పంపిణీ చేశామన్నారు. ఇంకా 247 టన్నులు వివిధ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రైవేటు డీలర్ల వద్ద 40 టన్నులు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

క్లుప్తంగా..

క్యాంపస్ ఇంటర్వ్యూలో 76 మంది ఎంపిక

సాలూరు: సాలూరు ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో సోమవారం నిర్వహించిన ఇంటర్వ్యూలలో 76 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. మొత్తం 126 మంది హాజరు కాగా.. అందులో 76 మంది ఎంపికైనట్లు ఆయన చెప్పారు. వీరికి అన్ని అలవెన్స్‌లు కలుపుకొని నెలకు రూ.14 వేల నుంచి రూ.21 వేల వరకు ఇస్తారని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

జియ్యమ్మవలస: ఆత్మహత్య చేసుకున్న బీటెక్ విద్యార్థి నల్ల సాయికిరణ్ నాయుడు కుటుంబాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. సోమవారం ఆమె చినకుదమ గ్రామానికి వెళ్లి సాయికిరణ్ నాయుడు కుటుంబాన్ని ఓదార్చారు. ఆమె వెంట డొంకాడ రామకృష్ణ, పల్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లుపై అవగాహన



కొమరాడ: ప్రస్తుతం ఖరీఫ్‌లో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. రైతులు వేసే పంటలపై మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగానే సోమవారం అర్తాం గ్రామంలో వరి నాట్లును వరుస క్రమంలో (తాడు ఉడుపు) వేసే పద్ధతిని రైతులకు వివరించారు.

ఎంపీ కలిశెట్టి సూచన హర్షణీయం

పాలకొండ: పార్లమెంట్‌లో విజయగనరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు రాజాం, పాలకొండ, సీతంపేట, కొత్తూరు, హడ్డుబంగి, పర్లాకిమిడి మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేయాలని ప్రస్తావించడం హర్షణీయమని రైతు సంఘ నాయకులు బుడితి అప్పలనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. రైల్వేలైన్ ఉంటే గిరిజన ఉత్పత్తులను మార్కెటింగ్‌కు ఉపయోగపడుతుందన్నారు.

వాహన తనిఖీలు

మక్కువ: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఎస్ఐ పి.నరసింహులు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శ్రీదేవి కాలనీ జంక్షన్ వద్ద పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఆటోలు, కార్లలో లగేజీలను తనిఖీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన మండలంలో వరినాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది సకాలంలో వర్షం కురవడంతో జూలై నెలాఖరులోనే వరినాట్లు పడడం గమనార్హం. భవిష్యత్తులో సకాలంలో వర్షాలు పడితే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయ మండల వ్యవసాయ అధికారి ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది గుమ్మలక్ష్మీపురం మండలంలో సుమారు ఆరు వేల ఎకరాల్లో వరి నాట్లు పడనున్నాయి. విత్తనాలు, ఎరువుల కొరత లేదని తెలిపారు.

1న పింఛన్ల పంపిణీ

వీరఘట్టం: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఆగస్టు 1వ తేదీన పింఛన్ల పంపిణీ కార్య క్రమం ఉంటుందని ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలో 9,896 మంది పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది పంపిణీ చేస్తారన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

సీతానగరం: మండలంలో మన గ్రోమోర్ సెంటర్లు రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని ఎరువుల విభాగం వ్యవసాయాధికారి రవీంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ గోదామును ఆయన పరిశీలించారు. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అవినాష్, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.సుధీర్, పి.లక్ష్మణ్‌రావులు పాల్గొన్నారు.